సాక్షి పెద్దపల్లి

శుక్రవారం, 15, సెప్టెంబర్, 2023



ఈకేవైసీతోనే రేషన్

రేషన్‌కార్డుకు ఈకేవైసీ అనుసంధానం తప్పనిసరి కానుంది. ఆహారభద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. II



క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి

ఆటల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. II

I

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

పెద్దపల్లిరూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. పెద్దపల్లిలో గురువారం మతపెద్దలు, పట్టణ ప్రముఖులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గణపతి మండపాల నిర్వాహకులు స్థానిక పోలీసులకు సమాచారం అందించి అనుమతి పొందాలన్నారు. వినాయకచవితి, మిలాద్‌ఉన్‌నబీ పండుగలను సోదరాభావంతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐ అనిల్, జగదీశ్, సత్యనారాయణ, చంద్రశేఖర్, ప్రసాద్, ఎస్సైలు మహేందర్, మల్లేశ్ ఉన్నారు.

మదర్‌థెరిసాలో వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై రిసోర్స్ పర్సన్ సతీశ్‌కుమార్, హరీశ్‌బాబు, శ్రీనివాస్, శైలజ అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రస్తుత పోటీ పరిస్థితులకు అనుగుణంగా అవగాహన పెంచుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల చైర్మన్ నవీన్‌కుమార్, డైరెక్టర్ నవత అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపేందర్, పవన్, అంబిక, వెంకటేశ్వర్లు, తస్లీంసుల్తాన, వినోద తదితరులున్నారు.


సర్టిఫికెట్లు అందించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఆదాయం, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణి, ప్రభుత్వ ఉత్తర్వు 58, 59 జీఓ దరఖాస్తులు, ప్రజావాణి, తదితర సమస్యలపై సమీక్షించారు. భూసంబంధ సమస్యలపై కలెక్టరేట్‌లో ధరణి సహాయక కేంద్రం ఏర్పాటు చేశామని, అక్కడ సందేహాలను నివృత్తి చేసుకునేలా చూడాలన్నారు. భూమిపై హక్కు ఎలా సంక్రమించింది..? రిజిస్ట్రేషన్, టైటిల్ పాస్‌బుక్ వివరాలు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ రాజ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ

రామగుండం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కల్పన సందర్శించారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, అధ్యాపకుల పనితీరు, విద్యార్థుల సంఖ్య, బోధన తీరును ప్రిన్సిపాల్ మదర్‌గౌడ్‌తో సమీక్షించారు. కళాశాలలో 200 మంది విద్యార్థులే ఉండడంతో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

17న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జ్యోతినగర్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రావు, గట్టయ్య తెలిపారు. టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయని, పాల్గొనేవారు సంబంధిత పత్రాలతో ఉదయం క్రీడా మైదానంలో హాజరు కావాలని, వివరాలకు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సుదేష్‌ను 94404 24640 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రుణమాఫీకి నిరీక్షణ



గౌరెడ్డిపేటలో రైతు కొమ్ము మధుకర్ ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

- 27,971 మంది రైతుల ఎదురుచూపు
- మూతపడిన 4,517 మంది రైతుల ఖాతాలు
- ఆచూకీ లేని 161 మంది వివరాలు
- జిల్లాకో 20మంది రైతులతో వ్యవసాయశాఖ సర్వే

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో రుణం పొందిన రైతులు మాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. ఇంకా 27,971 మందికి రుణమాఫీ కాలేదు. జిల్లావ్యాప్తంగా 75,819 రైతులకు రూ.470.52 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా ఇప్పటివరకు 47,848 మంది రైతులకు రూ.240.92 కోట్లు వారివారి ఖాతాల్లో జమ అయినట్లు అధికారవర్గాలు తెలిపాయి. రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇంకా నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

మూతపడిన 4,517 మంది ఖాతాలు

బ్యాంకుల నుంచి పంట రుణం పొందిన రైతుల ఖాతాకు మాఫీ సొమ్ము జమచేసేందుకు అధికారులు యత్నించగా.. 4,517 మంది ఖాతాలు మూతపడినట్లు గుర్తించారు. రైతుల ఆధార్‌కార్డు ఆధారంగా 4,356 మంది వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందించారు. తిరిగి బ్యాంకు ఖాతాలు పునరుద్ధరించుకోవాలని సూచించినట్లు అధికారవర్గాలు వివరించాయి. ఇందులో 161 మంది రైతుల వివరాల జాడ కానరావడంలేదని, వారి ఆచూకీ కోసం వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ఏఈఓలతో విచారణ చేయిస్తున్నామని, వీలైనంత త్వరలో వివరాలు తెలుసుకుని వారికి సమాచారం అందిస్తామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో పంట రుణమాఫీపై సర్వే

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 20 మంది రైతులు 15బ్యాంకుల్లో జిల్లా వ్యవసాయాధికారులు పంటరుణాల పంపిణీ, మాఫీపై సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో గురువారం నుంచి సర్వే చేపట్టారు. జిల్లాలోని పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన కొమ్ము మధుకర్ రైతు ఇంటికి వెళ్లిన జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి రుణమాఫీపై ఆరా తీశారు. తాను పంట రుణంగా పొందిన రూ.49,080 మాఫీ అయిందని మధుకర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఇలా పంటరుణాల పంపిణీ, రుణమాఫీ జరుగుతున్న విధానంలో ఉన్న లోటుపాట్లను గుర్తించేందుకే సర్వే నిర్వహిస్తున్నారని సమాచారం.

కలెక్టరేట్‌లో రుణమాఫీ హెల్ప్‌డెస్క్



పంట రుణమాఫీ 2018 సంబంధించి రైతుల్లో వ్యక్తమవుతున్న సందేహాలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో వ్యవసాయ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసింది. రైతులకు ప్రభుత్వం రూ.లక్ష పంట రుణాలను మాఫీ చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. రైతులకున్న సందేహాలు, కొత్తగా పంట రుణాలు పొందేందుకు సలహాలను అందించేందుకు ఈ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఆదిరెడ్డి సూచించారు. సెల్ ఫోన్‌నంబర్ 75699 42652లో సంప్రదించినా సూచనలిస్తారని పేర్కొన్నారు.

రుణమాఫీ కాలే



పంట రుణంగా బ్యాంకు నుంచి రూ.1.70లక్షలు రుణం తీసుకున్న. ఇప్పటివరకు రుణమాఫీ కాలే. పంటల సాగుకు సమయం మీరుతోంది. దశల వారీగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం వీలైనంత త్వరగా జమచేయాలి.

– దేవనంది సదయ్య, పెద్దకల్వల

ఏకకాలంలో మాఫీ మేలు



నాకు ఆరెకరాలు ఉంది. బ్యాంకులో రూ.1.95లక్షలు పంట రుణం తీసుకున్న. ఇప్పటివరకు మాఫీ కాలేదు. ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో మాఫీ చేసిన తీరున ఇస్తేనే రైతులకు ప్రయోజనంగా ఉంటుంది.

– బండ రవీందర్‌రావు, హన్మంతునిపేట

బ్యాంకు ఖాతాల సమస్యలతోనే



రుణమాఫీ సగానికిపైగా రైతుల ఖాతాల్లో జమయ్యాయి. మిగతా రైతుల ఖాతాలకు కూడా జమ చేస్తున్నారు. కొంతమంది రైతులు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించకపోవడం, రుణంపొందిన ఖాతా ద్వారా లావాదేవీలు జరపక, ఇలా పలు కారణాలతో నిలిచిపోయాయి. అటువంటివి గుర్తిస్తున్నాం.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

‘టెట్’కు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు పరీక్ష నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాలు
- 4,909 మంది అభ్యర్థులు హాజరు

సుల్తానాబాద్: జిల్లాలో శుక్రవారం నిర్వహించే టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాలను గుర్తించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో వసతులు కల్పించారు. పరీక్షకు 4,909 మంది హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించబోమని అధికారులు చెబుతున్నారు.

నామినల్ రోల్‌లో సవరణలు

టెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఏదైనా డేటా తప్పు అని గుర్తించినట్లయితే వారి భాష, మీడియం, సబ్జెక్ట్ మినహా పరీక్ష సమయంలో నామినల్ రోల్ కమ్ హాజరు షీట్‌లో అవసరమైన సవరణలు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో, సంతకం లేని అభ్యర్థులు గెజిటెడ్ అధికారితో ధృవీకరించుకోవాలి. ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అతికించాలని, ఫొటో ఐడీ (ఆధార్, ఏదైనా ఇతర ఫొటో ఐడీ)తో పాటు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి నో

అభ్యర్థులు తమ వెంట ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, లాగరిథమ్ పట్టికలు, కాలిక్యులేటర్, పేజర్, సెల్‌ఫోన్ తీసుకొని రావద్దని అధికారులు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో కేంద్రాలివే..

జిల్లాకేంద్రంలో 11 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. అందులో పెద్దపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ట్రినిటీ సెకండరీ మోడల్ స్కూల్, ట్రినిటీ పాఠశాల, ట్రినిటీ ఏసీ క్యాంపస్ సెకండరీ స్కూల్, అమర్‌నగర్‌లోని గాయత్రి హైస్కూల్, రంగంపల్లిలోని సెయింట్‌ఆన్ హైస్కూల్, వికాస్ జూనియర్ కళాశాల, ట్రినిటీ బీఈడీ కళాశాల (బందారికుంట), గీతాంజలి హైస్కూల్ శాంతినగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర), ట్రినిటీ జూనియర్ కళాశాల (స్టేషన్‌రోడ్) పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించనున్నారు.

రెండు పెన్నులు తెచ్చుకోవాలి

అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌పై సూచనలు చదవాలి. ప్రతి అభ్యర్థి తనతోపాటు రెండు చక్కటి బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, రైటింగ్ ప్యాడ్ తీసుకురావాలని, ఇతర రంగుల పెన్ అనుమతించబోమని అధికారులు తెలిపారు. దృష్టి లోపం ఉన్న అభ్యర్థులకు (40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు) ఇతరుల సహాయం తీసుకోవచ్చని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది నియామకం

కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని నియమించినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ తెలిపారు. సెంటర్ వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు ప్రాథమిక చికిత్సకు సంబంధించిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఏఎన్ఎంతోపాటు ఆశవర్కర్లు అందుబాటులో ఉంటార డీఈవో డి.మాధవి తెలిపారు.

మచ్చుపేటలో జ్వరాలు తగ్గుముఖం

- గ్రామాన్ని జల్లెడ పట్టిన వైద్యబృందం
- రెండు రోజులు ఇంటింటా సర్వే
- వైద్య శిబిరం ఎత్తివేత



ఇళ్లలో స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో విషజ్వరాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతుండగా ‘మంచంపట్టిన మచ్చుపేట’ శీర్షికన ‘సాక్షి’ కథనం ప్రచురించిన విషయం తెల్సిందే. దీంతో మండల వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా నిర్వహించిన శిబిరాన్ని ఎత్తివేశామని, ఇంటింటికీ తిరిగి సర్వే చేపడుతామని ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు తెలిపారు. సబ్ యూనిట్ అధికారి తిరుపతయ్య, హెచ్‌ఈవో నరసింహారెడ్డిని రెండు బృందాలుగా విభజించారు. రెండు బృందాల వైద్య సిబ్బంది ఇంటింట తిరుగుతూ ఇళ్లలో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్రతను తొలగిస్తూ దోమల నివారణకు రసాయన మందును పిచికారీ చేయించారు. 360 కుటుంబాలు ఉన్న మచ్చుపేట గ్రామాన్ని ఇంటింట వైద్య పరీక్షలతో జల్లెడ పట్టారు. 302 మందికి వైద్య పరీక్షలు చేయగా అందులో కొందరికి జ్వరాలు, మరికొందరికి దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు ఉన్నట్లు గుర్తించామని వైద్య సిబ్బంది తెలిపారు. గురువారం వైద్య పరీక్షలో జ్వరం వచ్చిన 11మందిని రామగిరి మండలం బేగంపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడగోని సతీశ్‌గౌడ్, సూపర్‌వైజర్లు వీరేశం, పశుల శ్రీనివాస్, మిట్ట శ్రీనివాస్, వైద్య సిబ్బంది లలిత, శోభారాణి, పుష్పలత, దీప్తి ఆశావర్కర్లు లత, కల్పన, రజిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

‘మద్దతు’ అంతంతే..!



సుల్తానాబాద్: రైతులు పండిస్తున్న పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. అయితే ఆ మొత్తం అంతంతమాత్రమేనని రైతులు పెదవి విరుస్తున్నారు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో 2023–24కు సంబంధించి పంటలకు ధర ప్రకటించింది. ఇందులో ప్రధానంగా వరికి ‘ఏ’ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ఇచ్చేలా ఎఫ్‌సీఐని ఆదేశించింది. పత్తి ‘ఏ’ గ్రేడ్‌కు రూ.7,020, ‘బీ’ గ్రేడ్‌కు రూ.6,620 మొక్కజొన్నకు రూ.2,090, కందులకు రూ.7,000, పెసలుకు రూ.8,558 చెల్లిస్తామని ప్రకటించింది.

జిల్లాలో వరిసాగే ప్రధానం

జిల్లాలో వరిని 2,13,815 ఎకరాల్లో సాగవుతుంది. ప్రతి సీజన్‌లో సుమారు 5 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి వస్తుంది. 2020–21లో క్వింటాల్ ధర రూ.1,960 ఉండగా 2021–22లో రూ.2,080కు పెంచారు. తాజాగా రూ.2,203గా ఖరారు చేశారు. గతంతో పోల్చితే వరి ధాన్యానికి కేవలం రూ.123 మాత్రమే పెంచారు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో క్వింటాల్‌కు కనీసం రూ.2,500పైచిలుకు ఉంటేనే కొంత ప్రయోజనం ఉంటుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

బాలలు, మహిళల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మహిళలు, బాలల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఎవరికైనా సమస్యలు, ఇబ్బందులుంటే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించి సేవలు పొందేలా అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై సమీక్షించారు. సఖీ కేంద్రం, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా అందుతున్న సేవలపై ఆరాతీశారు. మహిళ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098పై ప్రచారం చేయాలని, ప్రజలంతా వినియోగం చేసుకునేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

మూడు గ్రామాలకు రాష్ట్రస్థాయి అవార్డులు





అవార్డు అందుకుంటున్న సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, నాగారం సర్పంచ్ బూడిద మల్లేశ్

- జిల్లాలోని నాగారం, సుల్తాన్‌పూర్, గర్రెపల్లి ఘనత
- హైదరాబాద్‌లో అవార్డులు ప్రదానం
- మంత్రుల చేతులమీదుగా అందుకున్న సర్పంచులు

మంథని/సుల్తానాబాద్ రూరల్/ఎలిగేడు: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 కింద ఎంపికైన జిల్లాలోని మంథని మండలం నాగారం, ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్, సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామాలు అవార్డులు అందుకున్నాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, పంచాయతీరాజ్ డైరెక్టర్ చేతులమీదుగా రెండు వేల జనాభా కల్గిన కేటగిరీలో నాగారం సర్పంచ్ బూడిద మల్లేశ్, గర్రెపల్లి సర్పంచ్ వీరగోని సుజాత, కార్యదర్శి ప్రశాంత్ అవార్డు అందుకున్నారు. అలాగే సుల్తాన్‌పూర్ సర్పంచ్ అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కృష్ణ అవార్డుతోపాటు రూ.10లక్షల రివార్డును అందుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీధర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీపీఓ చంద్రమౌళి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.











జ్వరాలతో ఆసుపత్రి కిటకిట

వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లావ్యాప్తంగా జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఇన్‌పేషెంట్లతో వార్డులన్నీ నిండిపోతున్నాయి. ఔట్ పేషెంట్ల తాకిడి ఎక్కువవుతోంది. జిల్లాకేంద్ర ఆసుపత్రికి నిత్యం 500కు పైగా ఓపీ నమోదు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. వార్డుల్లో బెడ్‌లు సరిపోక ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున చికిత్స తీసుకుంటున్నారు. ముసురు వర్షాలతో జ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి



ఘటన స్థలంలో పోశమల్లు మృతదేహం

గోదావరిఖని(రామగుండం): విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ గుర్రాల పోశమల్లు(57) గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. స్థానిక మార్కండేయకాలనీలో పోశమల్లు ఇంటి నిర్మాణం చేస్తున్న క్రమంలో సపోర్టింగ్ కోసం వేసిన కర్ర విరిగింది. దీంతో రెండో అంతస్తు నుంచి విద్యుత్ తీగెలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు.

కారు, బైక్ ఢీ..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణశివారులోని రంగంపల్లి వద్ద గురువారం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న బైక్‌ను వెనకనుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న జడల అనిల్, అతడి భార్య ప్రవళిక, కూతురు తన్విశ్రీకి గాయాలైనాయి. క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి



రాజమౌళి (ఫైల్)

ముత్తారం(మంథని): మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారుపాక రాజమౌళి (84) బుధవారం రాత్రి గుండెపోటుతో చనిపోయాడు. ఈసందర్భంగా రాజమౌళి మృతదేహనికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, చాంద్‌పాషా, స్థానిక నాయకులు పార్టీ కండువా కప్పి నివాళి అర్పించారు. రాజమౌళి మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ దొడ్డ గీతారాణి, వీరగోని సంతోష్, పింగిలి రవీందర్‌రెడ్డి, సట్ల మొగిళి, సంగె వంశీ ఉన్నారు.

కేశనపల్లిలో యువకుడు..



రాజు (ఫైల్)

ముత్తారం(మంథని): మండలంలోని కేశనపల్లికి చెందిన కందునూరి రాజు(38) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. రాజుకు ఛాతిలో నొప్పి రావడంతో ఆర్‌ఎంపీతో కలిసి కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయగా ఏ సమస్య లేదని తెలుపడంతో బయలు దేరారు. తిరుగు ప్రయాణంలో మళ్లీ నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లిన కాద్దిసేప్పటికే మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య మానస, కొడుకు, కూతురు ఉన్నారు.

ఈకేవైసీతోనే రేషన్

- లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించనున్న డీలర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన పౌరసరఫరాల శాఖ

జిల్లాలో..

రేషన్ దుకాణాలు	413
లబ్ధిదారులు	6,27,841
రేషన్ కార్డులు	2,10,147
అన్నపూర్ణ కార్డులు	175
అంత్యోదయ కార్డులు	12,297



సుల్తానాబాద్(పెద్దపల్లి): రేషన్‌కార్డుకు ఈకేవైసీ అనుసంధానం తప్పనిసరి కానుంది. ఆహారభద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో జిల్లావ్యాప్తంగా డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలను సేకరించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

బోగస్ లబ్ధిదారుల ఏరివేత

జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాల్టీలతో పాటు రామగుండం కార్పొరేషన్ ఉండగా, 266 గ్రామ పంచాయతీల్లో రేషన్ డీలర్లు ఉన్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో నూతనంగా రేషన్ డీలర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా అనర్హులను ఏరివేయడానికి పౌరసరఫరాలశాఖ ఈకేవైసీ తప్పనిసరి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,10,147 రేషన్‌కార్డులు ఉండగా, 6,27,841 మంది లబ్ధిదారులున్నారు. కొన్ని చోట్ల మృతిచెందిన వారి పేరిట కూడా ప్రతి నెలా బియ్యం వస్తున్నాయి. ఆ కుటుంబంలో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేస్తే కుటుంబంలో అందరికీ బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే మృతుల వివరాలను కార్డులోంచి తొలగించి, అర్హుల పేర్లను చేర్చనున్నారు. ప్రభుత్వం ఇన్నాళ్ల తర్వాత చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లబ్ధిదారులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి వారి ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఈకేవైసీ లేదనే కారణంతో బియ్యం పంపిణీ తిరస్కరించడం జరగదని అధికారులు పేర్కొంటున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

ఆధార్‌కార్డులను లబ్ధిదారులు పది సంవత్సరాలకు ఒకసారి అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే చాలా మందికి సెల్ ఫోన్‌లో సందేశాలు కూడా వస్తున్నాయి. ఎవరైతే ఆధార్ నవీకరించుకున్నారో వారు(ఒక్క సభ్యుడు) రేషన్ దుకాణానికి వెళ్లి ఈ–పోస్ యంత్రంపై వేలిముద్ర వేయాల్సిన పనిలేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రేషన్ బియ్యానికి వెళ్లినప్పుడు తమ ఈకేవైసీ నవీకరించి ఉందో లేదో సంబంధిత డీలర్లనుంచి లబ్ధిదారులు తెలుసుకోవాలి. కాగా జిల్లా వ్యాప్తంగా 420 రేషన్ దుకాణాలు ఉండగా, 6,27,841 మంది వేలిముద్రలు ఈ– పోస్ యంత్రంపై సేకరించాల్సి ఉంటుంది. ఒక్కో డీలర్‌కు 300పైగానే కార్డులు ఉన్నాయి. ఈ ప్రకారం ఎంత సమయం పడుతుందో తెలియదు. అయితే అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి కార్డుదారుల నుంచి వేలిముద్రలు సేకరిస్తే అప్‌డేట్ సులభమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాలు వచ్చాయి

రేషన్‌కార్డు లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే అప్‌డేట్‌కు చివరి తేదీ అంటూ ఏమీ రాలేదు.

– ప్రేమ్‌కుమార్, డీఎస్‌ఓ

ప్రాణం తీసిన ఆన్‌లైన్ యాప్

- అప్పు తీర్చాలంటూ నిర్వాహకుల ఒత్తిడి
- ఉరేసుకొని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య



మార్చురీలో వంశీకృష్ణ మృతదేహం

పెద్దపల్లిరూరల్: ఏడాదిక్రితం సింగరేణిలో బదిలీపిల్లర్ (ఆర్జీ–ఏఎల్‌పీ)గా ఉద్యోగం పొంది భవిష్యత్తును ఆనందంగా గడపాల్సిన పల్లె వంశీకృష్ణ(26) ప్రాణాలను ఆన్‌లైన్ యాప్ బలిగొంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన వంశీకృష్ణ తండ్రి రాయమల్లు సింగరేణి కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించగా.. ఆ ఉద్యోగాన్ని ఏడాదిక్రితం పొందిన వంశీ మకాం పెద్దపల్లికి మార్చాడు. పట్టణంలోని చీకురాయి రోడ్డులో నివాసముంటున్న సమయంలో గుర్తుతెలియని ఆన్‌లైన్ యాప్ నుంచి కొంత రుణం పొందాడు. ఆ తర్వాత తిరిగి చెల్లించినా ఇంకా బాకీ ఉన్నావంటూ నిర్వాహకులు వంశీకృష్ణపై ఒత్తిడి పెంచారు. ఆ తర్వాత తన ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో బంధు, మిత్రులందరికీ షేర్ చేసి పరువు తీస్తామంటూ బెదిరింపులకు దిగారని కుటుంబీకులు ఆరోపించారు. ఆన్‌లైన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక మనస్తాపానికి గురైన వంశీకృష్ణ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు సైబర్‌నేరంగా కేసు నమోదు చేసి సైబర్‌క్రైం పోలీసులకు బదిలీ చేస్తున్నామని ఎస్సై వివరించారు.

‘ఖని’ కళాకారుడికి అంతర్జాతీయ పురస్కారం



సంకె రాజేశ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ప్రముఖ కళాకారుడు, తార ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు సంకె రాజేశ్ అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యాడు. 2014లో అమెరికాలో స్థాపించబడిన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థ, ఈనెల 17న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో రాజేశ్ పురస్కారం అందుకోనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీ సభ్యుడిగా, నృత్యాంజలి బాధ్యుడిగా, తార ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులుగా దాదాపు నాలుగు దశాబ్దాలుగా సాంస్కృతిక, కళా రంగానికి రాజేశ్ అందిస్తున్న సేవలకుగాను పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, అధ్యక్షుడు మురళి వెన్నెం, కార్యదర్శి రవి కొండబోలు తెలిపారు. ఈసందర్భంగా రాజేశ్ పురస్కారానికి ఎంపిక కావడంపై గోదావరిఖనికి చెందిన కళాకారులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి

గోదావరిఖని(రామగుండం): ఆటల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్‌అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటలతో ఆరోగ్యవంతంగా జీవించేలా సింగరేణీయులు ముందడుగు వేయాలన్నారు. తమ దినచర్యలో భాగంగా రోజులో కనీసం ఒకగంట క్రీడామైదానంలో గడిపేలా దైనందిక కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన తొగరి మధు (26) మద్యం మత్తులో గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేందర్ వివరాలు.. మద్యానికి బానిసైన మధు గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి


పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని గురువారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ నాయకుడు పెర్క సదానందం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని సమస్యలు వివరించారు.

నేడు ఎస్టీపీ ప్లాంట్ ప్రారంభం

కోల్‌సిటీ(రామగుండం): కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2.76 కోట్లతో నిర్మించిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభిస్తారు. ఎమ్మెల్యే చందర్, మేయర్ అనిల్‌కుమార్ పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు.







బొగ్గుబాయి వార్తలు

సీఎంఓఏఐ తీరు సరికాదు

- రాంచీలో సమావేశమైన ఐదు జాతీయ కార్మిక సంఘాలు
- మూడురోజులు బొగ్గు పరిశ్రమలో సమ్మెకు తీర్మానం



సమావేశంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) తీసుకున్న నిర్ణయం సరికాదని జాతీయ కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గురువారం రాంచీలోని దర్భంగా హౌజ్‌లో బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ వైస్ ప్రసిడెంట్ మజ్రుల్‌హక్‌అన్సారీ తో నాయకులు మాట్లాడినట్లు బీఎంఎస్ సింగరేణి అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఆఫీసర్స్ అసోసియేషన్ చర్యతో బొగ్గు పరిశ్రమలో కార్మికులు, అధికారుల మధ్య కొన్నేళ్లుగా కొనసాగుతున్న సత్సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. యాజమాన్యం మళ్లీ పే రివ్యూ అధికారులకు వర్తింపజేస్తే దాని ప్రకారం బొగ్గు గని కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇకనుంచి అధికారులతో బొగ్గు పరిశ్రమకు సంబంధించిన ఏ వేదికలోను కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొనవద్దని నిర్ణయించారు. వచ్చేనెల 5,6,7 తేదీల్లో బొగ్గు పరిశ్రమలో 3రోజుల సమ్మె చేయాలని తీర్మానించారు. సమ్మె విజయవంతం చేసేందుకు అన్ని యూని యన్లు సంయుక్తంగా సన్నాహాలు ప్రారంభించాలని, దీనికి సంబంధించి ఓసీపీలు, గనులు, డిపార్ట్‌మెంట్లో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

గని విస్తరణకు సహకరించాలి

- ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్



గ్రామస్తులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): గని విస్తరణకు గ్రామాన్ని వెంటనే ఖాళీ చేసి సహకరించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. గురువారం ఇల్లెంద్ గెస్ట్‌హౌజ్‌లో రామగిరి మండలం చందనాపూర్ గ్రామస్తులతో గోదావరిఖని ఏసీపీ శ్రీనివాస్, టూటౌన్ సీఐ వేణుగోపాల్‌తో కలిసి సమావేశమయ్యారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, గ్రామానికి రావాల్సిన నష్టపరిహారం అందించిన క్రమంలో జీడీకే–11గని పనుల పురోగతి, బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ఎస్సీ కాలనీలోని గృహాలను తొలగించాలన్నారు. చట్టపరంగా పరిహారం చెల్లించామని, మిగతా వాటి కోసం రెవెన్యూ, ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. అక్కడ పూర్తిగా ఇళ్లను తీసేసిన తర్వాతే మైనింగ్ పనులు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. వెంటనే ఖాళీ చేయలేని పరిస్థితుల్లో వనరుల కొరత ఏర్పడి విద్యుత్ సమస్యలు తలెత్తుతాయన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామంలోని ఇళ్లు, సామగ్రి వెంటనే ఖాళీ చేయాలని తెలిపారు. ఈవిషయంలో గ్రామస్తులు సానుకూలంగా స్పందించినట్లు అధికారులు వెల్లడించారు. సమావేశంలో ఎస్టేట్స్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, చందనాపూర్ సర్పంచ్ దాసరి శంకర్, సింగిరెడ్డిరెడ్డిపల్లి సర్పంచ్ జగన్నాదుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో అధికారులు

గోదావరిఖని(రామగుండం): గతేడాదిలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని కార్పొరేట్ టార్గెట్ కమిటీ కన్వీనర్ జె.రమేశ్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ కోరారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మాట్లాడారు. వచ్చేఏడాది ఏరియాలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు లక్ష్యాలు, అవసరమయ్యే యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావలసిన స్పేర్ పార్ట్స్‌ల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతిఒక్కరూ రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలకు కృషిచేయాలన్నారు. సమావేశంలో వకీల్‌పల్లి ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఓసీపీ–3 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం సలీం, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు పరీక్ష



పరీక్షకు హాజరైన మహిళలు

రామగిరి(మంథని): ఆర్జీ–3 పరిధి సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణపొందిన మహిళలకు గురువారం సెంటనరీకాలనీ కమ్యూనిటీహాల్‌లో పరీక్ష నిర్వహించారు. 2022–23లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 200 మంది మహిళలు టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందగా పరీక్షకు 150 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షించారు. డీవైపీఎంలు మారుతి, సునీల్, సీనియర్ పీవో రాజేశం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, వివిధ కోర్సుల శిక్షకులు ఆశ్విని, సుధ, భాగ్యలక్ష్మి, స్వప్న, పద్మ, ఆస్మ తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీని సందర్శించిన కార్పొరేట్ జీఎం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న జీఎం సాయిబాబు

గోదావరిఖని(రామగుండం): కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం సాయిబాబు గురువారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీని సందర్శించారు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, రక్షణ తదితర అంశాలను తనిఖీ చేశారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించేలా చూడాలన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు ఏజెంట్ చంద్రశేఖర్, ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు, డీజీఎం డి.రామస్వామి, మేనేజర్ అనిల్‌గబాలే తదితరులున్నారు.

దుబాయి నుంచి వచ్చి.. భార్య ప్రియుడిని చంపి..

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడి దారుణ హత్య



పడిగెల నరేశ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్యతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడని తెలుసుకున్న భర్త దుబాయి నుంచి వచ్చి యువకుడిని హత్య చేశాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలలో సంచలనం సృష్టించింది. గ్రామస్తులు, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. మల్యాలకు చెందిన పడిగెల నరేశ్(27) అదే గ్రామానికి చెందిన వివాహిత(32)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన వివాహిత బావ కుమారుడు లక్ష్మణ్ దుబాయ్‌లో ఉంటున్న ఆమె భర్త మల్లేశంకు తెలిపాడు. ఈనెల 3వ తేదీన గల్ఫ్ నుంచి వచ్చిన మల్లేశం ఇంటికిరాకుండా ఎక్కడో తలదాచుకున్నాడు. నరేశ్‌ను చంపేందుకు అదును కోసం ఎదురుచూస్తున్నాడు. బుధవారం రాత్రి నరేశ్ సదరు వివాహిత ఇంట్లోకి వెళ్లడం గమనించిన బావ కొడుకు లక్ష్మణ్ ఆమె భర్త మల్లేశంకు సమాచారం అందించాడు. మల్లేశం మాస్కులు ధరించి బైక్‌పై ఇంటికి చేరుకుని.. భార్యతో ఇంట్లో ఉన్న యువకుడిపై కత్తితో దాడి చేశాడు. మంచంపై నుంచి కింద పడ్డ నరేశ్‌పై పదే..పదే కత్తితో దాడి చేయగా తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే హత్యకు పాల్పడ్డ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, పలువురు ఎస్సైలు బుధవారం అర్ధరాత్రి ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. మల్లేశం కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. హత్య జరిగేందుకు మరో నలుగురు సహకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.

సాయంత్రం విందు.. అర్ధరాత్రి హత్య

పడిగెల నరేశ్‌కు అదే గ్రామానికి చెందిన వివాహితతో ఐదేళ్ల క్రితమే వివాహేతర సంబంధం ఏర్పడింది. అదే సమయంలో వివాహిత కుటుంబ సభ్యులకు, యువకుడి మధ్య గొడవలు జరుగడంతో నరేశ్ దుబాయి వెళ్లాడు. అక్కడే ఐదేళ్లపాటు ఉన్నాడు. గత ఆగస్టు 29న ఇంటికొచ్చిన నరేశ్ తిరిగి సదరు వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఇది గమనించిన వివాహిత భర్త అన్నలతోపాటు వారి కుమారుడు ఈ విషయాన్ని గల్ఫ్‌లో ఉంటున్న మల్లేశంకు తెలిపారు. ఈనెల 3న దుబాయి నుంచి ఇండియా వచ్చిన మల్లేశం బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం వివాహిత కుటుంబ సభ్యులు బుధవారం యువకుడి ఇంట్లోనే విందు చేసుకున్నారు. తర్వాత యథావిధిగా ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు.బంధువుల ఇంట్లో తలదాచుకున్న మల్లేశంను అదే సమయంలో స్వగ్రామానికి పిలిపించుకున్నారు. ఇది తెలియని యువకుడు రాత్రి అందరూ పడుకున్న సమయంలో వివాహిత వద్దకు వెళ్లాడు. గమనించిన లక్ష్మణ్ తన చిన్నాన్న మల్లేశంకు ఫోన్ చేయడంతో బైక్‌పై వచ్చి యువకుడిపై దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు.

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న మల్లేశం పరారీకాగా.. అనుమానం ఉన్న ముగ్గురితోపాటు వివాహితను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు సహకరించిన వారి వివరాలను కాల్‌డాటా ఆధారంగా సేకరిస్తున్నట్లు సమాచారం. వారం క్రితమే హత్యకు పథకం రచించినట్లు తెలిసింది.

పోలీసుల లుక్‌ఔట్ నోటీసు

యువకుని హత్యలో ప్రధాన నిందితునిగా భావిస్తున్న మల్లేశ దుబాయి నుంచి ఈనెల 3న ఇండియాకు వచ్చాడు. హత్య చేసేందుకు ముందుగానే తిరిగి దుబాయి వెళ్లేందుకు సిద్ధమై.. రాత్రి 11 గంటల ప్రాంతంలో హత్యచేసి ఎయిర్‌పోర్టుకు అదే రాత్రి వెళ్లిపోయాడన్న ప్రచారంతో పోలీసులు లుక్‌ఔట్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.